

కథా కౌముది

అంబ నొపై నీ దయ అపర్ణ మునుకుట్ల గునుపూడి

గదిలో కూర్చుని పుస్తకం చదువుతున్న సుజాతకి తలుపు చప్పుడైతే, స్కూలునుండి పిల్లలు వచ్చుంటారనుకుని మళ్ళి పుస్తకంలోకి తల దూర్చింది.

“అమ్మా, సుమీ ఎదో మాట్లాడుతూ ఒకలాగా ఉంది” అంటూ పదిహేనేళ్ళ సుమంత్ వచ్చి తల్లితో చెప్పేడు.

“ఒకలాగ అంటే ఏమిటి సుమంత్? ఎవరితోనైనా పోట్లాట పెట్టుకుందా?”

“ఏమో తెలీదు. దానికి అబ్బాయిలంటే గిట్టరని, అమ్మాయిల మీద ఆపేక్షని అంటోంది”.

“అంతేనా! పన్నెండేళ్ల పిల్లకి అబ్బాయిలు అమ్మాయిల గురించి ఎంత తెలుస్తుంది సుమంత్?” అని కొట్టిపారేసింది.

దానితో ఆగితే కథేముంది?

సుమంత్ తొమ్మిది, సుమిత్ర ఏడో తరగతిలోను ఉన్నారు. సుమిత్ర ఇంకా పెద్ద మనిషి అవలేదు. ఆ వయస్సులో వచ్చే శారీరక మార్పుల వల్ల కొంత తేడాగా ఉండడం మామూలే. కానీ కొన్ని రోజులకి సుమిత్ర మాట్లాడడం తగ్గించిందని గ్రహించింది సుజాత. మాట్లాడడానికి ప్రయత్నం చేసినా మిన్నకుండి తన గదిలోకి వెళ్లి పోతోంది. అదే విషయం భర్త సుధీర్తో చెప్తే , ఏమీ అనకుండా కొంత కాలం వేచి చూద్దాం, అదే సర్దుకుంటుందేమో అన్నాడు.

తర్వాతి నెలల్లో సుమంత్ రెండు మూడు మార్లు హెచ్చరించాడు. మనసులో ఏముందో ఇదమిద్దంగా తెలియటం లేదు గాని అదోలా ఉండడం, ఎక్కువగా ఒక్కర్తీ గదిలో ఉండడానికి ఇష్టపడుతోందని గమనించింది. ఎప్పుడూ సరదాగా ఉండే పిల్ల ఇలా మారడం కాస్త వింతగానే ఉన్నా దేనికో ఇబ్బంది పడుతోందని అర్థం అయ్యింది. స్కూలుకి వెళ్లడం, చదువు, మిగతా పనులు అన్ని మామూలుగానే ఉన్నాయి. నిలదీసి ప్రశ్నించదగ్గ తప్పేం చేయలేదు. అలాంటప్పుడు ఎందుకు, ఏమని, ఎలా అడగాలో తేల్చుకోలేకుండా ఉండిపోయింది. మరో రెండ్నెలల్లో వేసవి సెలవలు వచ్చేయి. అంతే కాకుండా ఈ లోగా సుమిత్ర పెద్దమనిషయ్యింది. ఇదంతా దాని మూలానే అనుకుని, పిల్లకి ప్యూబర్టీ, సెక్స్ గురించి, స్కూల్లో చెప్తారని తెలిసినా, తన వంతుగా ఆరోగ్య విషయాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎప్పుడు ఏ సందేహం ఉన్నా తన్ని అడగమని చెప్పింది సుజాత. అన్నిటికీ తలూపుతూ ముభావంగానే వింది సుమిత్ర. సరే సెలవలు అయ్యేలోగా అన్ని సర్దుకుంటాయి అనుకున్నారు భార్యా భర్తలు.

ఓ రోజు, సుధీర్ ఆఫీస్కి వెళ్ళేక, బయటికి వెళదాం అని బయలుదేరగా, సుమిత్ర, సుమంత్ బట్టలు వేసుకుని వచ్చింది.

"అదేం నీ బట్టలు ఏమయ్యాయి?"

"లాండ్రిలో ఉన్నాయి!" క్లుప్తంగా జవాబిచ్చి కార్లో కూచుంది.

ఆ జవాబు నిజం కాదని వాళ్ళిద్దరికీ తెలుసు. ఎందుకంటే రెండురోజుల క్రితమే, అందరి బట్టలు లాండ్రీలో వేసి మడతలు పెట్టి పెట్టింది సుజాత. ఆ తర్వాత వరుసగా వారం రోజుల్లో నాలుగు రోజులు సుమంత్ బట్టల్లో కనిపించింది సుమిత్ర. ఒకరోజు వాళ్ళ నాన్న చొక్కా తొడుక్కోవచ్చా అని అడిగింది. ఇక ఉపేక్షించకూడదనుకుని,

"ఏమైందమ్మా! నీ బట్టలు నచ్చడం లేదా? లేక పట్టడం లేదా? కావాలంటే నీకు నచ్చినవి కొనుక్కొద్దాం పద" అంది సుజాత.

"నో, దట్స్ ఓకే, ఐ ఏం ఫైన్" అంటూ తన గదిలోకి వెళ్ళిపోయింది.

స్కూళ్లు తెరిచే రోజు దగ్గర పడుతుంటే, మాములుగా చేసే స్కూల్ షాపింగ్ కి ఉత్సాహం చూపించలేదు. నాకేం అక్కరలేదు అంటూ దాటేసింది.

"అదేమిటే కొత్త ఫ్యాషన్ ఏమిటో చూడవా? కొత్త బట్టలు కొనుక్కోవా?" పెద్ద మనిషై అందాలు సంతరించుకుంటున్న కూతురికి అల్ట్రా మోడర్న్ బట్టలు కొని అవి వేసుకుంటే మెరిసిపోయే పిల్లని చూసి మురిసిపోవాలని తహతహలాడిన సుజాత మనసు చిన్నబోయింది. పిల్లకి ఏమైందబ్బా!

"నాకు కావాలమ్మా, నా బట్టలన్నీ చెల్లి తీసేసుకుంటోంది" అంటూ వచ్చాడు సుమంత్.

"ఏమిటీ!" ఆశ్చర్యంతో కొడుకుకేసి చూసింది. దీనికి ఈకో ఫ్రెండ్లీ, రీయూస్, రీసైకిల్" లాంటి వ్యవహారం తలకెక్కిందేమో! లేకపోతె వాడి బట్టలు అది వేసుకోవడం ఏమిటీ? ఇదేదో తరచి చూడాల్సిన వ్యవహారమే! అప్పటికి ఊరుకుని సుమంత్ ని తీసుకుని షాపింగ్ వెళ్ళింది.

వచ్చే దారిలో సుమంత్ మెల్లిగా

"అమ్మా సుమీ ఈస్ నాట్ హ్యాపీ విత్ హెర్సెల్ఫ్" అన్నాడు.

"వ్వాట్!" ఎందుకలా అంటున్నావు?"

"అది నాతొ కూడా సరిగా మాట్లాడడం లేదు. పార్క్ కి, లైబ్రరీకి వెళదాం అంటే రానంటోంది. ఎందుకనడిగితే ఐ ఏం నాట్ ఫిల్లింగ్ గుడ్, ఐ ఫీల్ అగ్లీ, ఐ హేట్ మైసెల్ఫ్, నాకు భయంగా ఉంది, ఐ డోంట్ వాంట్ టు లివ్, అంది". సుమంత్ చెప్పింది విని అవాక్కయింది సుజాత.

"ఇప్పుడా చెప్పడం! ముందే నాతో ఎందుకు చెప్పలేదు? అలాగంటే దాన్ని ఒక్కర్తినీ ఇంట్లో వదిలేదాన్ని కాదు కదా. ఒక్కర్తీ ఏం చేస్తోందో, ఏమిటో!" గుండె గాభరాతో ఎలాగో డ్రైవ్ చేస్తూ ఇంటికి చేరేరు. ఆదుర్దాగా "సుమీ, సుమీ" అంటూ లోపలికి అడుగు పెట్టింది.

వంటింట్లో కనిపించిన కూతురిని చూసి మనసు కాస్త కుదుట పరుచుకుని,

"ఇక్కడ ఏం చేస్తున్నావు"? అంటూ దగ్గరికి వచ్చిన సుజాతని కలవరంగా చూసింది సుమిత్ర, ఎడం చేతి మణికట్టు దగ్గర పేపర్ టవల్ చుట్టబెట్టుకుంటోంది. దాంట్లోంచి ఎర్రగా రక్తం కనిపిస్తోంది. దాన్ని దాచడానికి విశ్వ ప్రయత్నం చేస్తోందని స్పష్టంగా తెలుస్తోంది.

"ఏమయిందే?"

"నథింగ్, ఐ వస్ కట్టింగ్ ఎన్ ఆపిల్ అండ్ పోక్డ్ మైసెల్ఫ్"

"అయ్యయ్యో, ఏదీ నన్ను చూడనీ", అంటూ దగ్గరికి వెళ్లి "సుధీర్, ఫస్ట్ ఎయిడ్ కిట్ పట్రా", అని సుమిత్ర చేతి చుట్ట విప్పి చూసి హడిలిపోయింది. మణికట్టు దగ్గర అస్తవ్యస్తంగా కోసినట్టు ఉన్న గాయం! అది ఆపిల్ తరుగుతూ తగిలిన గాయం కాదని అర్థమయ్యింది. సుజాతకి వెన్నెముకలో వణుకు పుట్టింది. అయినా తమాయించుకుని, దేముడు నాయందున్నాడు సమయానికి ఇంటికి చేరేం, అని మనసులోనే దండం పెట్టుకుని,

"ఇదేమిటే ఇంత దెబ్బ తగిలితే, నథింగ్ అంటావు, ముందు బాగా కడిగేవా? అంటూ సుమిత్రని సింక్ దగ్గరగా తీసుకువెళ్లి గాయాన్ని శుభ్రంగా నీళ్లతో కడికి, మరో టవల్తో తుడిచి రక్తధార దగ్గర గట్టిగా అదిమి పట్టుకోమని, సుమంత్ పట్టుకొచ్చిన క్రీం రాసి, గాజ్ తో కట్టు కడుతూ, యధాలాపంగా "ఆపిల్ ఏది"? అంది. వంచిన తల ఎత్తకుండా "తినేసాను", అంది సుమిత్ర. అది అబద్ధం అని తెలిసిన సుమంత్ తల్లి వైపు చూసేడు. తనకి ఆ విషయం తెలిసినా సుజాత ఏ భావం వ్యక్తపరచలేదు. అంటే ఇందాక సుమంత్ చెప్పిన మాటల్లో కొంతైనా నిజముందన్నమాట. నిర్ధారణగా దేనికో ఘర్షణ పడుతోంది.

"నొప్పెడుతోందా?"

"కొంచెం"

"రెండు టైలినాల్స్ వేసుకో. ఏమైనా తింటావా! జ్యూస్ తాగు, సుమంత్ కొంచెం జ్యూస్ తెచ్చిపెట్టమ్మా!"

"నో, ఐ ఏం ఓకే!" అంటూ రూంకి వెళ్ళిపోయింది.

సుమిత్ర అటు వెళ్ళగానే, సుధీర్ వచ్చేవరకు తన కర్తవ్యం ఏమిటాని ఆలోచిస్తూ, కత్తుల డ్రాయర్ తెరిచింది. కత్తులు అన్ని అక్కడే ఉండడంతో, హమ్మయ్య! అనుకుని కాస్త స్థిమిత పడి, ట్రాష్ కేన్ తెరిచి చూసింది. మొత్తం నాలుగు పేపర్ టవల్స్ ఉన్నాయి, ఎక్కువ రక్తం పోలేదు.

సుమంత్ అక్కడే ఉండి, అమ్మా అని ఎదో చెప్పబోయేడు. ఈ పరిస్థితిలో ఏం మాట్లాడినా సుధీర్ వచ్చేకే అని తేల్చుకుని

"ఇప్పుడు మాట్లాడడానికి సమయం కాదు సుమంత్. చెల్లి దగ్గరికి వెళ్లి దానితో ఏవైనా కబుర్లు చెప్పు దాని దగ్గరే ఉండు, లేకపోతే ఏదైనా మూవీ చూడండి" అని పంపేసింది.

వాడు అటు వెళ్ళగానే అప్పటిదాకా తెచ్చి పెట్టుకున్న పట్టు సడలి, దుఃఖం ముంచుకొచ్చింది, కళ్ళ వెంబడి బొటబొటా నీరు కారింది. ఏమిటి జరుగుతోందో, ఏం వినాలో, విని ఎలా తట్టుకోవాలో అన్న భయాందోళనతో, రాత్రికి వంట మొదలు పెట్టింది సుజాత.

★★★★★

ఆ సాయంత్రం సుధీర్ రోజూలాగే వచ్చినా, ఎప్పుడు వస్తాడా అని ఏదురు చూస్తూన్న సుజాతకి ఎన్నో యుగాలైనట్టు అనిపించింది. ఇంకా ఆలస్యం ఎందుకని, వెంటనే ఆ రోజు జరిగినదంతా ఏకరువు పెట్టింది. అన్నీ విన్న సుధీర్

"తొందరపడకు, ఎవరితోనైనా ప్రేమలో పడ్డదేమో కనుక్కున్నావా?"

"నేను ఏమీ అడగలేదు. ఈ వయసులో ప్రేమలేమిటి? అయినా నువ్వు వచ్చే వరకు ఏం మాట్లాడదలచుకోలేదు. సుమంత్ తో కూడా అదే చెప్పేను."

"సరే ఖంగారు పడకు, బట్టలు మార్చుకు వస్తానుండు. విషయం ఏమిటో కనుక్కుందాం" అని బెడ్రూమ్ వైపు నడిచాడు సుధీర్. సుధీర్ మాటలతో కాస్త కుదుటపడింది సుజాత.

సుధీర్ వచ్చి, "సుమిత్ర ఎక్కడ ఉంది" అన్నాడు.

"ఇద్దరు దాని గదిలోనే ఉన్నారనుకుంటా, బయటికి రమ్మన్నా?"

"వద్దు, మనమే వెళదాం. ఇదిగో సుజా! అక్కడ అది ఏం చెప్పినా ఆవేశపడడం, ఆక్రోశించడం, అరవడంలాంటివేం చెయ్యకూడదు. వీలయినంత నిబ్బరంగా ఉండటానికి ప్రయత్నిద్దాం".

విని సరేనన్నట్టు తలూపింది. ఇద్దరూ సుమిత్ర గది దగ్గరికి వెళ్లేరు. సగం తెరిచి ఉన్న తలుపు మీద తట్టేడు. సుమంత్ వచ్చి తలుపు పూర్తిగా తెరిచేడు. ముందు సుధీర్, ఆ వెనకే సుజాత లోపలికి వెళ్ళేరు. బట్టలు, పుస్తకాలు మంచినీళ్ల సీసాలు, అట్ట డబ్బాలు, గదంతా చిందర వందరగా ఉన్నాయి. సుమిత్ర పక్కమీద బాసింపట్టు వేసుకుని కూర్చుంది. సుమిత్ర మొహం అప్పటిదాకా ఏడుస్తోందని అడగకుండానే తెలుస్తోంది. సుమంత్ తండ్రికి కుర్చీ చూపించాడు. అందులో కూర్చుంటూ

"సుమీ నీకు గాయం అయిందని అమ్మ చెప్పింది. ఎం జరిగింది?" జవాబివ్వకుండా సుమిత్ర తల వంచుకుని ఉండిపోయింది.

"చూపించు"

"ఇట్స్ నథింగ్ డాడ్" మెల్లిగా అంది.

"జస్ట్ లెట్ మీ సీ"

"ఏం లేదని చెప్తున్నాగా" స్వరం పెంచింది. వెంటనే సుజాత వెళ్లి దాని పక్కగా కూచుంది.

"ఈస్ ఇట్ హర్టింగ్"

"నో ఇట్ ఇస్ నాట్ హర్టింగ్"

"ఇస్ సంథింగ్ ఎల్స్ హర్టింగ్?"

"నో"

"సుమీ!" అన్నాడు సుమంత్

సుమిత్ర అన్న వైపు అదోలా చూసింది. వాడు దాని మొహంలోకి చూస్తూ ఏవో భావాలని వ్యక్తీకరిస్తున్నాడు. వాళ్లిద్దరి మధ్య సంభాషణ జరుగుతోంది, కానీ సమస్య ఏమిటో తెలియడంలేదు.

"వాట్ ఇస్ గోయింగ్ ఆన్" అంటూ సుమంత్ వైపు చూసేడు సుధీర్.

సుమంత్ నోరు తెరవబోతే, తల అడ్డంగా ఊపుతూ "అన్నా ప్లీజ్ నో" అంటూ సన్నగా ఏడుస్తూ రెండు చేతులతో మొహం కప్పేసుకుంది సుమిత్ర. సుజాత ఏం మాట్లాడకుండా సుమిత్ర దగ్గరగా జరిగి భుజం మీద చేయి వేసి దగ్గరికి తీసుకుంది. దాంతో సుమిత్ర తల్లిని కట్టేసుకుంది. సుజాత, సుధీర్ ఒకర్నొకరు చూసుకున్నారు.

"అరే ఎందుకురా ఏడవడం? ఎవరైనా ఏదైనా అన్నారా? బ్యాడ్ రిపోర్ట్ కార్డ్? ఎనీబడి బుల్లియింగ్? దేనికీ భయపడకు, వి కెన్ ఫిక్స్ ఎవ్రిథింగ్? ఏం జరిగిందో చెప్పకపోతే నేనేం చెయ్యగలను" సుధీర్ ధైర్యం చెబుతూ కుర్చితో సహా దగ్గరగా వచ్చి తల మీద చెయ్యి వేసేడు.

అంతే, కట్టలు తెగిన వరదలా భోరుమంటూ తల్లి గుండెల్లోకి తల దూర్చేసింది సుమిత్ర. సుజాత కాస్త ఖంగారు పడ్డా, తొణకకుండా పిల్ల వీపు నిమురుతూ గట్టిగా హత్తుకుంది. సుధీర్ ఇక చేసేది లేక నీకేమైనా తెలుసా అన్నట్టు సుమంత్ వైపు చూసేడు.

సుమంత్ చెల్లి వైపు చూస్తూ రెండు నిముషాలు ఆగి, పొద్దుట తల్లితో చెప్పిన విషయాలు గబగబా వివరించి గుండె భారం దించుకున్నాడు. అవన్నీ ముందు సుజాత చెప్పినవే. వయసు, చదువు వత్తిడి వల్ల కాస్త బెంబేలు పడడం సబబే కానీ "ఫీలింగ్ అగ్లీ" అన్నది మాత్రం బోధపడడం లేదు. తిరిగి కూతురివైపు చూస్తూ

"డోంట్ వర్రీ! వర్రి ఇస్ ది వర్స్ట్! కరేజ్ ఐస్ ది బెస్ట్! సుమంత్ చెల్లికి కాసిని మంచినీళ్లు తీసుకురా" అన్నాడు.

అక్కడినుంచి కదిలే ఉద్దేశ్యం లేదన్నట్టుగా వాడు అక్కడే ఉన్న మంచినీళ్ల సీసాల్లో ఒక సీసా తీసి అందించేడు.

"సుమీ, ఇదిగో మంచినీళ్లు తాగు. కాం డౌన్! మా దగ్గర నీకెందుకు భయం? అమ్మా ,నేను మిమ్మల్ని ఎప్పుడైనా, దేనికైనా దెబ్బలాడేమా?" యు టూ అర్ మోస్ట్ ప్రెషస్ ఫర్ అస్. అమ్మ ఎప్పుడూ ఏం జరిగినా ధైర్యంగా ఎదుర్కోవాలి గాని ఏడవకూడదని అంటుంది కదా! మరి ఇదేమిటి? కమాన్, నిన్ను ఇంత ఇబ్బంది పెడుతున్న సమస్య ఏమిటో చెప్పు! దాన్ని ఎలా ఫిక్స్ చేయాలో మేం చూస్తాం" మళ్ళీ భరోసా ఇచ్చేడు సుధీర్.

సుమిత్ర తేరుకుని మంచినీళ్ల సీసా అందుకుంటూ, తల్లినుండి విడిపించుకుని, అన్న వైపు చూసింది. వాడు ఏం చేయమంటావు అన్నట్టుగా తిరిగి చూసేడు. కళ్ళతోనే ఎదో మాట్లాడి తల దించుకుంది సుమిత్ర.

సుమంత్ మెల్లిగా "సుమీ ఇస్ ఫీలింగ్ డిఫరెంట్! షి వాంట్స్ టు బి సుహాస్!" అన్నాడు.

విన్నదేమిటో కొంత అర్థం అయినా, తేలికగా

"ఓస్ అంతేనా! నీ పేరు మార్చుకుంటానంటున్నావా! వెరి సింపుల్" అన్నాడు సుధీర్.

"నో డాడ్, ఇట్ ఇస్ నాట్ దట్ సింపుల్! ఐ ఏం సీరియస్! సుమీ ఫీల్స్ అండ్ వాంట్స్ టు బి ఎ మేల్ పర్సన్! షి నీడ్స్ ఎ జెండర్ ఛేంజ్!" విషయం స్థూలమైనా వివరం సూక్ష్మంగా చెప్పేసి తన బాధ్యత తీర్చుకున్నాడు, సుమంత్!

ఉలిక్కి పడిన సుజాత గుండె గుభేల్మంది! తల్లీ లలితాంబా, ఏమిటీ పరీక్ష!

అంతలోనే, పసివాళ్ళయిన కొడుకు, కూతురు ఇంత బరువుని ఎన్నాళ్ళబట్టి మోస్తున్నారో అని తల్లి హృదయం విలవిలలాడింది. వెంటనే "సుమీ" అంటూ కూతురిని అక్కున చేర్చుకుంది.

కొడుకు చెప్పిన విషయం విని అవాక్కవడం సుధీర్ వంతయ్యింది!

సుధీర్కి ఠక్కున ఆర్నెల్ల క్రితం ఆఫీస్ లో జరిగిన సంఘటన జ్ఞాపకం వచ్చింది. తనతో పనిచేసే స్టెల్లా ఎక్కడ పనులక్కడ వదిలేసి హఠాత్తుగా సెలవు పెట్టింది. ఇంట్లో ఎదో ఇబ్బంది అయ్యుంటుందనుకుంటూ తన పని, ఆవిడ పనీ కూడా తాను చక్కబెట్టేడు. రెండు వారాల తర్వాత తిరిగి వచ్చింది. నేను చేసిన సహాయానికి ధన్యవాదాలు చెప్పి, నేను చెయ్యగా మిగిలిన పనులు అందుకుని, మామూలుగా పని సాగించింది. రెండు వారాలయ్యాక మీటింగ్ పెట్టింది. ఆ మీటింగ్ లో స్టెల్లా నెమ్మదిగా

"నేను సెలవు ఎందుకు పెట్టానో చెప్పడానికి ఈ మీటింగ్ పెట్టేను" అంది

"అలాగా, ఏమిటి సంగతి"

"నేను సెలవు పెట్టడానికి ముందు శనివారం నాడు మా అన్నయ్య కొడుకు ఆత్మహత్య చేసుకున్నాడు"

"మైగాడ్, ఐ ఏం సో సారీ!"

"థాంక్యూ"

చటుక్కున ఎదో గుర్తుకి వచ్చి "స్టెల్లా, మీ అన్నయ్య కూతురు కేరన్, హైస్కూల్లో ఉందని చెప్పేవు కానీ కొడుకు గురించి ఎప్పుడూ చెప్పలేదే! పిల్లాడికి ఎన్నేళ్లు?"

స్టెల్లా కాస్సేపు మౌనంగా ఉండి, "మా అన్నయ్యకి ఒకడే, కేరనే కెన్ అయ్యాడు, ట్రాన్స్ జెండర్ (ట్రాన్స్)". అది విని తన నోట మాట రాలేదు. ఏమనాలో తోచనూ లేదు. ఎదో ఒకటి అనాలి గనక

"ఎప్పటినుండి".

"రెండేళ్లుగా"

"తలి తండ్రులు గొడవ చేసారా?"

"లేదు. అందరం సంతోషంగా ఒప్పుకున్నాం. అయినా ఇలా జరిగింది" దుఃఖంతో గొంతు జీరబోయింది.

"స్కూల్లో ఏవైనా గేలి చేసేరా?"

"అలాగని మాకేం చెప్పలేదు. ఇన్నాళ్లు బాగానే ఉన్నాడు. దేశ నాయకులు మారడంతో వీళ్ళు తీసుకునే మార్పులకి, చర్యలకి భయపడ్డాడేమో! పాత నాయకులు వీరిని గుర్తించాలని, ఇప్పటి నాయకుల వీరిని తుడిచివెయ్యాలని పాటుపడుతున్నారు కదా" అంది.

ఆవిడ భావన చూచాయగా చెప్పినా, భావం సూటిగా అర్థం అయ్యింది. కాస్సేపయ్యాక కాస్త ధైర్యం చేసి

"ఎలా పోయేడు".

వెంటనే ఘొల్లుమంది స్టెల్లా. తనేం మాట్లాడకుండా ఉండిపోయేడు. రెండు నిముషాలకి సర్దుకుని,

"కొండ మీద నుండి దూకేసేడు" తన గుండె కొట్టుకుంది. హే భగవాన్! పగవారికి కూడా అటువంటి క్షోభ వద్దని కోరుతూ, ఆ తలితండ్రులకి ఈ క్షోభని భరించే శక్తిని ప్రసాదించమని ప్రార్థించేడు. ఈ విషయంగా ప్రస్తుతం నడుస్తున్న రాజకీయ సంక్షోభం ఎంతమందిని మింగుతుందో, ఇంకెంతమంది ఇలా కడుపు కోత భరించాలో అనుకుంటూ స్టెల్లాకి ధైర్యం చెప్పి, ఏ సహాయం కావల్సినా అడగమనడం జరిగింది.

ఇప్పుడు, నా పరిస్థితీ అదేలా ఉంది ! జరిగింది తలుచుకుంటే, అమ్మో! కొంచెం ఆలస్యం అయి ఉంటే తన కొంప ఘొల్లుమనే పరిస్థితి వచ్చేదేమో అన్న తలపుకి గుండె జలధరించింది. వెంటనే తన పిల్ల ఏ అఘాయిత్యం చెయ్యకుండా, ఎదుట ఉన్నందుకు ఆ భగవంతుడికి కృతజ్ఞతలు చెప్పుకుంటూ, తక్షణం తన పిల్ల క్షేమం తప్ప ఇంకేదీ ముఖ్యం కాదని తేల్చుకుని, సుమిత్ర వైపు తిరిగి,

"సుమీ, నిజమేనా! అదేనా విషయం?" సుధీర్ మామూలుగానే అంటున్నా కంఠం కాస్త గంభీరంగా మారడం మిగతా ముగ్గురికి అర్థం అయ్యింది.

తల నిలువుగా ఊపింది సుమిత్ర.

"ఓకే, ఎప్పటినుండి?"

"ఎబౌట్ ఎ ఇయర్"

"అప్పుడే ఎందుకు చెప్పలేదు సుమీ"

"ఐ వాస్ కన్ఫ్యూస్డ్ అండ్ స్కేర్డ్"

"ఐ అండర్ స్టాండ్! ఇదే కావాలని నువ్వనుకుంటున్నావా? లేక ఎవరైనా అంటున్నారా? ఇస్ ఇట్ ఇన్ యువర్ మైండ్ ఆర్ ఇన్ యువర్ బాడీ?"

"ఐ డోంట్ నో!"

"ఓకే, ఫైన్! నువ్వు చిన్న పిల్లవి. నీకు ఎం కావాలో నీకే తెలియని వయస్సు. నువ్వు కోరుకుంటున్నది జరుగుతుందని నేను గ్యారంటీ ఇవ్వలేను. ఎం జరిగితే అదే జరుగుతుంది. కనక అన్నింటికీ సిద్ధంగా ఉండాలి. వి ఆర్ ఆల్ బిహైండ్ యు అండ్ వి ఆర్ ఇన్ దిస్ టుగెదర్! నువ్వు అధైర్యపడకూడదు. సిల్లీగా అలోచించి పిచ్చి పనులేం చెయ్యకూడదు. అండర్ స్టాండ్!" అంటూ అందరి తరఫున హామీ ఇస్తూ సుజాత వైపు సుమంత్ వైపు చూసేడు. సుజాత నోట మాట రాక అతడినే చూస్తూ ఉండిపోయింది. సుమంత్ సరే నన్నట్టుగా తల ఊపేడు.

సుధీర్ దేని గురించి అలా చెప్పాడో అర్థం అయినట్టు సుమిత్ర తల ఊపింది.

"ఇప్పుడు చెప్పు, ఇవాళ ఎం చేద్దాం అనుకున్నావ్?"

"ఐ ఏం సారీ! కుడ్ వి నాట్ టాక్ ఎబౌట్ ఇట్"

"ఓకే ఒప్పుకుంటాను, కానీ ఇంకెప్పుడూ చెయ్యవుగా! వి లవ్ యూ వెరీ మచ్ అండ్ దట్ విల్ నాట్ ఛేంజ్ ఫర్ ఎవర్! వి ట్రస్ట్ యూ వెరీ మచ్ అండ్ డోంట్ లెట్ దట్ ఛేంజ్ ఫర్ ఎవర్!"

తండ్రి మాటలతో కొండంత ధైర్యం వచ్చిన సుమిత్ర "ఎస్ డాడీ! నెవర్ అగైన్!"

"దట్స్ మై గళ్! ఓకే, లెట్ అస్ గో బైక్ రైడింగ్! దారిలో ఫలాఫల్ జాయింట్ దగ్గర ఆగొచ్చు. గెట్ రెడీ" అంటూ లేచేడు సుధీర్.

సుమిత్ర లేచి "థాంక్యూ అన్నా!" అంటూ సుమంత్ ని కట్టేసుకుంది.

సుమంత్ "ఐ లవ్ యు బ్రో!" అంటూ వీపు తట్టేడు. అది చూసిన సుజాత కళ్ళలో నీళ్లు తిరిగేయి!

సుధీర్ లేచి సుజాత భుజం మీద చేయి వేసి నొక్కాడు. దానిమీద తల ఆనించి కళ్ళు మూసుకుంది సుజాత. పై కంటిలో నీటిచుక్క ముక్కు మీదుగా జారీ కింది కంటి నీటితో కలిసి ఒక పెద్ద చుక్క అయి అతని చేతిమండ మీదకి జారింది. తల్లీ నాకెందుకీ శిక్ష! పేలవంగా కళ్ళు తుడుచుకుంటూ లేచింది సుజాత.

తర్క వితర్కాలు, ఆవేశాలు, ఆగ్రహాలు లేకుండా వడ్ల గింజలో బియ్యపు గింజ బయట పడ్డది. తన దాకా వస్తే కాని తగవు తెలీదు. అందరి ముందు బింకంగా ఎదో చెప్పేసేడు, కానీ ఈ ఉపద్రవం తట్టుకోడానికి తనకి ధైర్యం ఉందా! తలుచుకుంటే గుండె పిండినట్టు అయింది! స్టెల్లా మేనకోడలు ఉదంతం వల్ల ఇంత ధైర్యం, స్థిమితం వచ్చిందా? తెచ్చిపెట్టుకున్న ధైర్యం చివరిదాకా ఉంటుందా! ఇక ముందుంది మొసళ్ల పండగ అనుకుంటూ, పక్కనున్న సుమంత్ భుజం గర్వంగా తట్టి, భారంగా కదిలేడు సుధీర్.

★★★★★

ఆ రాత్రి, ఎవరి గదుల్లో వారు చేరుకున్నారు. అప్పుడు మొదలైంది అసలు సంభాషణ.

"ఇప్పుడు మనకేది దారి?"

"దారికేముంది. దీనిగురించి ఏదైనా చూసేవా?"

"ఇప్పుడేగా తెలిసింది? అసలు ఇవాళ జరిగినదంతా కలా, నిజమా అని సతమతమవుతున్నాను. రేపు తెల్లారితే అన్ని మారిపోతాయేమో అనిపిస్తోంది".

"అటువంటి భ్రాంతి పెట్టుకోకు. మనం సరిగ్గా చూసుకోకపోతే మన పిల్ల మనకి దక్కదు." అంటూ స్టెల్లా మేనకోడలు కథ వివరించేడు సుధీర్. వింటుంటేనే సుజాతకి బాధతో వణుకు పుట్టింది.

"కానీ ఇది అంత చిన్న విషయమా సుధీర్! ఇప్పటి పరిస్థితుల్లో అమ్మాయి అబ్బాయి అయితే ఎన్ని ఇబ్బందులో నీకు తెలియనివి కావు. వాళ్ళు ఆటల్లో తోటి మగపిల్లలతో తట్టుకోలేరు. మగపిల్లలతో కలిసి తిరిగితే వీరు మాన భంగానికి గురి కావచ్చు. సంఘం వారిని వేధిస్తుంది. వీరికి స్థానం ఏది? వీరికి గుర్తింపు ఎక్కడుంది? నీకు గుర్తుందా, ఆమధ్య ఓ ట్రాన్స్ పిల్లాడు స్కూల్లో వత్తిడికి తట్టుకోలేక రైలు కింద పడి పోయేడు. ఇది విన్నావా! కాలిఫోర్నియాలో ఒక ట్రాన్స్ అమ్మాయిని జైల్లో పెడితే ఆ అమ్మాయి (అమ్మాయిగా అయిన అబ్బాయి) జైల్లోనే ఉన్న మరో స్త్రీని మానభంగం చేసిందిట! ఇటివంటి ఎన్నో ఆటంకాలు! వీటన్నిటిని తట్టుకోగలమా!"

"కాదనను, కానీ ఇక్కడ ఇష్టాయిష్టాలు, తట్టుకోగలమా లేదా అన్న ప్రసక్తే లేదు. మన సుమిత్ర కోసం మిగతా ఎందరో కేరన్ లాంటి పిల్లల కోసం మనం ముందడుగు వేయక తప్పదు. నువ్వు ముందస్తుగా దాన్ని పీడియాట్రిషన్ దగ్గరకి తీసుకువెళ్లు. ఈ లోపల ట్రాన్స్ గురించిన వివరాలు సేకరిస్తాను. మళ్ళీ పిల్లలతో మాట్లాడుదాం. నలుగురూ ఏమనుకుంటారు అన్న భయం వద్దు. మనమే భయపడితే సుమిత్ర గతేమిటి? నీకు నేను, నాకు నువ్వు, మనిద్దరం మన పిల్లలకి. అంతవరకే ఆలోచించు. వైద్యుల సంప్రదింపులు అయ్యేక మన వాళ్ళకి చెబుదాం. బహుశ ఇది చాలా ఖర్చుతో కూడిన వ్యవహారం. అది తర్వాత ఆలోచిద్దాం! ఇది మనకి మించిన బాధ్యతే, కానీ అధిగమించలేనిది కాదు!" అన్నాడు.

అంత నిశ్చయంగా తన నిర్ణయం చెప్పిన సుధీర్ మాటలు విన్న సుజాతకి దుఃఖం పెల్లుబికింది.

"ఎంత తేలిగ్గా నిర్ణయించేసేవ్"

"మరో మార్గం ఏమిటో చెప్పు! సుమిని మనసు మార్చుకోమని ఒత్తిడి చేద్దామా! అది ఎంత అసమంజసమో నీకు తెలుసు! నీకీ విషయం తెలుసా? ట్రెవర్ ప్రాజెక్టు లెక్కలప్రకారం అమెరికాలో 45 సెకెన్లకొక ట్రాన్స్ ఆత్మహత్యా ప్రయత్నం జరుగుతోందని. ఇవాళ జరిగింది అటువంటి ప్రయత్నమేగా!"

"....."

"ఏమాలోచిస్తున్నావు సుజా"

"నాకు ఎటూ తోచడంలేదు" ఆవేదనగా అంది.

"ఇప్పుడేం ఆలోచించకు. తర్వాత మాట్లాడుదాం"

సానందంగా జరిగిపోతున్న తన జీవితం తల్లక్రిందులైన ఈ రోజు ఒక మరపురాని రోజుగా మిగిలిపోతుంది, బాధగా నిద్రకుపక్రమించింది.

★★★★★

ఈ పరిస్థితిని ఏమని వర్ణించాలి? జబ్బు కాదు అందామంటే వైద్యుల సహాయం అవసరం కనక జబ్బు కానీ జబ్బు. ఆడపిల్ల అబ్బాయి అవడమా, ఏమిటీ ఈ పిచ్చి అందామంటే మానసిక వైద్య సహాయం కావాలి కనక పిచ్చి కానీ పిచ్చి. పోనీ అంగ వైకల్యమా అంటే సర్వాంగాలు స్వచ్ఛందంగా పని చేస్తుంటే లోపం కానీ లోపం. ఇదొక సందిగ్ధావస్థ!

అన్యమనస్కంగానే వివిధ వైద్యుల సంప్రదింపులు, మానసిక వైద్యుల సలహాలు గబగబా జరుగుతున్నాయి. లింగమార్పిడని నిర్ధారణ అయ్యేక సుజాత, తల్లిదండ్రులకు చెప్పింది. "దాన్ని నిన్న ఎంత ప్రేమించామో ఇవాళ, ఇకముందు కూడా అంతే ప్రేమిస్తాం. దాని క్షేమమే మాకు, మీకూ ముఖ్యం!" తిరుగులేని ఆ మాటతో, తల్లి కైలాస శిఖరాగ్రాన్న నిలుచుంది. ఇంతకుమించిన వెన్ను తట్టు ఇంకేం కావాలి!

సుజాతకి చిన్నపుడు విన్న పాట ఒకటి గుర్తొచ్చింది.

ధైర్యము ధైర్యము నా శృతి

వీర ధీర సాహసమే నా గతి!

తెలివి తెగువ నా తలి తండ్రులు

వీరోత్సాహములే నాకన్నలు

భయము భీరువు నా శత్రువులు

జయ విజయులు నా అనుంగు మిత్రులు

తనని ఈ సందిగ్ధావస్థ నుంచి జాగృదావస్థకు మరలించగల మార్గం అక్షరాలా ఆ నుడుగే! ఇది శిక్ష కాదు, పరీక్ష! ఇందులో మేమే కాదు, యావత్ప్రపంచం నెగ్గాలి!

★★★★★

ఇక చికిత్స పలురకాలు! బ్రెస్ట్ బైండింగ్, స్థనాల్ని, గర్భ సంచీని తీసేయడం, గడ్డాలు, మీసాలు రావడానికి హార్మోన్ థెరపీ, కంఠ నాళాలకి చికిత్స, జెండర్ అఫర్మింగ్ సర్జరీ, ఒకటేమిటి, వరసగా ఒకదాని తర్వాత మరొకటి చెయ్యడానికి పెద్ద జాబితా, దానికి అయ్యే ఖర్చు చూసి సుజాతకి తల తిరిగిపోయింది. కానీ గుండె దిటవు చేసుకుని, అన్ని సవ్యంగా జరగాలని విఘ్నేశ్వరుడికి ముడుపుకట్టి, ఒక ప్రణాళిక ప్రకారం ఆరంభించింది.

సుమిత్రని దగ్గరలోనే ఉన్న అత్యుత్తమ జెండర్ క్లినిక్కి తీసుకెళ్లింది. సుమారు మూడేళ్లపైగా పట్టవచ్చన్నారు. కావాల్సిన వనరులన్నీ కూర్చుకుని చికిత్స ప్రారంభించారు. సుజాత తన శక్తినంతా జరుగుతున్నచికిత్స, వాటి వివరాలు చదవడం వంటి పనులకి కేంద్రీకరించింది. పేరు మార్పిడికి చేయాల్సిన తంతు అంతా పిల్లలే చూసుకున్నారు. సుమిత్ర సుహాస్ అయ్యేడు. స్కూల్లో కౌన్సిలర్కి చెప్పడం, పాస్పోర్ట్ తతంగం సుధీర్ చూసుకున్నాడు. సుహాస్ లో మార్పులు కొన్ని పొడచూప సాగేయి. రెండేళ్లు గడిచేయి. ప్రణాళిక ప్రకారం ఒక ఒరవడిగా సాగుతున్న సమయంలో ఒక రోజు క్లినిక్ లో ప్రకటన చూసిన సుజాత నెత్తిమీద పిడుగు పడ్డట్టు అదిరిపడింది.

“కేంద్ర ప్రభుత్వ వనరులు రద్దు చేయడంతో **30** రోజులలో క్లినిక్ మూసివేయబడును”.

ఏమిటీ దారుణం? ఇక్కడ శాస్త్ర పరిజ్ఞానం, కావాల్సిన పరికరాలు, ఆరితేరిన వైద్యులు ఉన్నారు, కానీ ఎవరికోసం? ఎందుకిలా? లాభాపేక్షా? రాజకీయమా? సంఘ సంక్షేమం గతేంటి? దుఃఖం తన్నుకు వస్తోంది. గొంతులో ఎదో ముడి పడ్డట్టుగా మాట రావడం లేదు. పాలకులే దుండగులయితే ఇంకెవరితో చెప్పుకోవాలి మా గోడు?

★★★

COMMENTS